క్లుప్తంగా

ముమ్మరంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం మండలంలో కొత్తూరు తాడేపల్లి గ్రామంలో శనివారం జరిగింది. కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తూరు గ్రామంలోని జగనన్న కాలనీలో 320 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలను పంపిణీ చేసింది. వారిలో 303 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేశామని గ్రామ సచివాలయ కార్యదర్శి కె.మురళీమోహన్ తెలిపారు.

ఘనంగా భావనాఋషి కల్యాణం

మైలవరం: మైలవరం విజయవాడ రోడ్డులోని భద్రావతి సమేత భావనాఋషి స్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండవగా జరిగింది. కల్యాణ మహోత్సవాలు ఈనెల 16న ప్రారంభమై 18వ తేదీతో ముగుస్తాయి. స్వామి వారి కల్యాణం సందర్భంగా ద్వారకా తిరుమల దేవస్థానం అనువంశిక ధర్మకర్త సూరానేని నివృతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచిత్ర వేషధారణలు, మేళతాళాలతో స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రథసప్తమిని పురస్కరించుకుని కృష్ణాజిల్లా పద్మశాలీ సంఘం ఆహ్వానం మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు, రాష్ట్ర పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వానపల్లి నాగరాజు, ఏలూరు సంఘం కుటుంబ సభ్యులు గిడుతూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. ద్వారకా తిరుమల అర్చకులు స్వామి వార్లకు కల్యాణం నిర్వహించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

నూజివీడు: రానున్న ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ అన్నారు. నూజివీడు మండలం కొత్తూరు తండాలో శనివారం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ఎన్నుకునే హక్కు ఓటరుకు ఓటు ద్వారానే ఉందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ టి.సరస్వతి, ఏపీఎం దయాల రాజశేఖర్, వైఎస్సార్ క్రాంతిపథం సీసీలు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి



నూజివీడు: లోక్ అదాలత్‌పై కక్షిదారుల్లో అవగాహన కల్పించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. స్థానిక 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. నాగశైలజ మాట్లాడుతూ మార్చి 9న కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలోనే అత్యధిక కేసులు పరిష్కరించేలా కృషిచేసి నూజివీడు కోర్టును ప్రథమస్థానంలో నిలపాలని కోరారు. సమావేశంలో జడ్జీలు షేక్ పెదఖాసిం, వి.వెంకటేశ్వరరావు, కె.హరికృష్ణ, డీఎస్పీ చిటికెన మురళీకృష్ణ, సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలల మానసిక వికాసానికి కృషి చేయాలి



తిరువూరు: బాలల మానసిక వికాసానికి ఆటపాటలు దోహదం చేస్తాయని, దీనికి బాలోత్సవాల నిర్వహణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. శనివారం స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బాలోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో నెలకొన్న నైపుణ్యాలను వెలికితీసి వారిని మంచి కళాకారులుగా, క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. రెండు వేల మంది బాలబాలికలు వివిధ అంశాల్లో తమ ప్రతిభ కనబరిచారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, సీఐ అబ్దుల్ నబీ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఎస్. నాగేశ్వరరెడ్డి, బాలోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు గుళ్లపల్లి చినబాబు, హరికృష్ణ, పాపారావు, సుబానీ, రాంప్రదీప్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రవి, వెంకటరత్నం పర్యవేక్షించారు.

నమ్మకున్న వారిని మోసం చేసే వ్యక్తి చంద్రబాబు

- అండగా ఉండేది సీఎం వైఎస్ జగన్
- విజయవాడ ఎంపీ కేశినేని నాని
- ఆసరా చెక్కుల పంపిణీ



జి.కొండూరులో చెక్కు అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని, తిరుపతిరావు తదితరులు

జి.కొండూరు: నమ్మకున్న వారిని మోసం చేసే వ్యక్తి చంద్రబాబు అయితే నమ్మిన వారి కోసం సర్వం కోల్పోయినా పరవాలేదు అనుకొని అండగా నిలబడే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. జి.కొండూరు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధుల విడుదల సంబరాలు జరిగాయి. ఆసరా చెక్కును డ్వాక్రా సంఘాలకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంపీ అందజేశారు. అనంతరం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర నగదు బహుమతులను అందజేశారు. ఎంపీ నాని మాట్లాడుతూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దేవినేని ఉమామహేశ్వరరావు తన స్థానంపై తనకే నమ్మకం లేనప్పుడు నియోజకవర్గ ప్రజలకు ఏమి గ్యారంటీ ఇవ్వగలడని ఎద్దేవా చేశారు. మైలవరం ఎమ్మెల్యే టికెట్‌ను రూ.200 కోట్లకు చంద్రబాబు అమ్ముకుంటున్నాడని దేవినేని ఉమా స్వయంగా అన్నారన్నారు. ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే విస్మరించే గుణం ఉన్న చంద్రబాబుకు, కరోనా లాంటి మహా విపత్తు వచ్చిన సమయంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి ఎవరైనా పొరపాటున టీడీపీకి ఓటు వేసినా అది బూడిదలో పోసిన పన్నీరేనని, చంద్రబాబు ఇక మీదట విజయం సాధించడం అసాధ్యమని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపుదల, అనేక సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని వివరించారు. ఒక సామాన్యుడు సర్నాల తిరుపతిరావుని మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించి బలహీనవర్గాలపై తనకున్న ప్రేమను ముఖ్యమంత్రి చాటుకున్నారన్నారు. మరోసారి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మనందరి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాబు ష్యూరిటీ రాష్ట్ర ప్రజల కోసం కాదని అతని పనికిమాలిన కొడుకు లోకేష్ కోసమని విమర్శించారు. నియోజకవర్గ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల వల్ల ప్రజలు వివక్షకు గురయ్యారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. మైలవరం నియోజకవర్గం గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగిరేందుకు ప్రజలంతా మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



వలంటీరు ప్రత్తిపాటి కల్యాణికి సేవా వజ్ర అవార్డును అందజేస్తున్న ఎంపి కేశినేని నాని

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



ఇబ్రహీంపట్నంలో ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎంపీ కేశినేని నాని అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కును డ్వాక్రా సంఘాలకు అందజేశారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ ఇచ్చిన హామీల మేరకు నవరత్న పథకాలతో రూ.2.50 లక్షల కోట్లతో పేదలకు సంక్షేమ పథకాలను దేశంలో అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పేదలను దారుణంగా మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్‌కే ష్యూరిటీ లేదని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ గెలుపు మీకోసంగా భావించి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఇన్‌చార్జ్ తిరుపతిరావు మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రజలు దీవెనలు అందించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జి కొండూరు ఎంపీపీ వేములకొండ తిరుపతమ్మ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు బండి నాగమణి, బానావత్ నాగబాలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, ఎంపీడీఓ ఉమాదేవి, తహసీల్దార్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ తవ్వకాలపై చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కొత్తూరు తాడేపల్లిలో క్వారీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

విజయవాడరూరల్: కొత్తూరు తాడేపల్లి, వేమవరం, జక్కంపూడి గ్రామాల్లో అక్రమ మైనింగ్ తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, వేమవరం గ్రామాల్లో తవ్విన క్వారీలను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అక్రమ మైనింగ్ చేసిన ప్రాంతాల్లో కొలతలు వేసి క్యూబిక్ మీటర్ల ప్రకారం బాధ్యులైన వారి నుంచి వసూలు చేయాలని మైనింగ్ అధికారులను, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయి నివేదికను తయారుచేసి పంపాలన్నారు. ప్రభుత్వ పోరంబోకు, వసంత రాయుడి తిప్ప, పోలవరం కాలువ వెంబడి టిట్కోకు చెందిన భూముల్లోను, చెరువు పోరంబోకు భూమిలో అక్రమ మైనింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకోవడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించ వద్దన్నారు. ఇక నుంచి ఈ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ జరిగితే మైనింగ్, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్, ఆర్డీఓ భవానీ శంకర్, మైనింగ్ ఏజీ, విజయవాడ రూరల్ తహసీల్దార్ పి.జాహ్నవి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చెక్కపల్లి సొసైటీని లాభాల బాటలో నడపాలి



లింగారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ముసునూరు: రైతులకు సత్వర సేవలందించి, వ్యవసాయ సొసైటీని లాభాల బాటలో నడపాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నూతన త్రిసభ్య కమిటీ సభ్యులకు సూచించారు. చెక్కపల్లి వ్యవసాయ సొసైటీ ప్రాంగణంలో మాజీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన అధ్యక్షతన ఇటీవల అధ్యక్షుడిగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కాటేపల్లి లింగారావును ఆయన సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, పార్టీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు దత్తుడు శ్రీను, ఉప సర్పంచ్ పద్మజ, ఎంపీటీసీ సభ్యురాలు తోట రమాదేవి, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, మాజీ డైరెక్టర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

నవదిన ప్రార్థనలు ప్రారంభం

నూజివీడు: స్థానిక సిలువగట్టు వద్ద నవదిన ప్రార్థనలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 26, 27, 28 తేదీల్లో సిలువగట్టు తిరునాళ్లు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ మాట్లాడుతూ ఏసుక్రీస్తు యెడల ప్రతి ఒక్కరూ కృతజ్ఞత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ విచారణ గురువులు రెవ. ఫాదర్ లాం జయరాజు, సిలువగట్టు పుణ్యక్షేత్ర రెక్టార్ రెవ.ఫాదర్ గొర్రెముచ్చు జోసఫ్, రెవ. ఫాదర్ పెయ్యల మరియదాసు, రెవ. ఫాదర్ తోట మరియదాసు, రెవ. ఫాదర్ కె.మహేష్, సిస్టర్ చిన్నమ్మ, మఠకన్యలు, ఉపదేశులు, ఉత్సవ కమిటీ పెద్దలు, టౌన్ విచారణ, నెహ్రూపేట విచారణ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు సన్మానం



ఇబ్రహీంపట్నంలో వలంటీర్‌ను సత్కరించిన ఎంపీ కేశినేని నాని, సర్నాల తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం: ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం ఎంపీ కేశినేని నాని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా ఒకరికి సేవా వజ్ర, ఇద్దరికి సేవా రత్న, మరో ఇద్దరికి సేవా మిత్ర అవార్డులతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ సుదర్శనమూర్తి సమర్పణ



మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను చెందిన సముద్రాల రాజ వెంకటపాపారావు, జ్యోతి దంపతులు, వారి కుటుంబీకులు పెనుగొలను శివారు మెట్టగుట్టపై ఉన్న శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో రూ. 35 వేల విలువైన పంచలోహ సుదర్శనమూర్తిని ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాప్‌రెడ్డికి శనివారం అందజేశారు. అర్చకులు శ్యామసుందరాచార్యులు దాత కుటుంబీకులను ఆశీర్వదించారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌ను ఎంఈఓ-2 ఎ. సూరిబాబు శనివారం సందర్శించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులను కలిసి పరీక్షలకు ప్రిపరేషన్ ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు మ్యాథ్స్‌లో కొన్ని మెలకువలను వివరించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని సూచించారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్. సత్యనారాయణ, సీఆర్‌పీ వై. గోపి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి. డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

ముసునూరు: అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం .. వలసపల్లిలో సారా విక్రయిస్తుండగా కుమ్మకూరి వెంకటేశ్వరరావును అదుపులోకి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మైలవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని చెప్పారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల వ్యవస్థాపక చైర్మన్ లకిరెడ్డి బాలిరెడ్డి జయంతిని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, విజయవాడ ప్రభుత్వాస్పత్రి సౌజన్యంతో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్న యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలన్నారు. ప్రభుత్వాస్పత్రి మెడికల్ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ ఎస్కే ఆస్మా మాట్లాడుతూ రక్తదానం చేసిన విద్యార్థుల్లో రక్తం త్వరగా ఉత్పత్తి అయ్యేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శివహరిప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్.ఉమామహేశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.కె. హరినాథరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ, ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి

మైలవరం: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ప్రవాసాంధ్రులు, విద్యాదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ స్టాల్స్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మార్కెట్ ఫెట్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల పిండి వంటకాలను ఇంటి వద్ద తయారు చేసుకుని వచ్చి కళాశాలలో నిర్వహించిన ఫెట్‌లో విక్రయించారు. వచ్చిన సొమ్మును చారిటీకి అందజేశారు. డాక్టర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదువు అనే మూడు అక్షరాలను ప్రేమించడం ఎంతో ముఖ్యమైందన్నారు. విద్యార్థులు తమ మధురమైన అనుభూతులను వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ విద్యార్థులకు చారిటీ, సేవా దృక్పథం, సృజనాత్మకత, ఆనందం పంచాలనే ఉద్దేశంతో ఈ ఫెట్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మెండా దేవానందకుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడిలో తామర పురుగును నివారించాలి

చాట్రాయి: మామిడిలో తామర పురుగు నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన శాఖాధికారి హేమ రైతులకు సూచించారు. ఆరుగొలనుపేట, బూరుగుగూడెం, చనుబండ గ్రామాల్లో మామిడితోటలను శనివారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మామిడిలో తామర పురుగు నివారణకు వేప నూనెలో మూడు లీటర్ల పీపీఎంని కలిపి పిచికారీ చేయాలన్నారు. ఒకవేళ ఉధృతి ఎక్కువగా ఉంటే 0.25 స్పైనోసాడ్‌ని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు.

ఓటు హక్కుపై అవగాహన



చాట్రాయి: ఓటు హక్కు చాలా విలువైనదని ఎంపీడీఓ మంగాకుమారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటు హక్కుపై మహిళా సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకుని సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ, ఆయా సెంటర్లలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మురళీకృష్ణ, ఏపీఎం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి: విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. చాట్రాయి మండలం జనార్దనవరం, పోలవరం, కోటపాడు, చీపురుగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

ఎ.కొండూరు: వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం ఎ.కొండూరు అడ్డరోడ్డు సమీపంలోని మ్యాంగో మార్కెట్ యార్డులో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని జెడ్పీటీసీ భూక్య గనియా శనివారం తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పాల్గొంటారన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

తిరువూరు/విస్సన్నపేట: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్‌లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో గతంలో సారా కాస్తూ పట్టుబడిన వారి నివాస గృహాల్లో సోదాలు చేసిన ఎస్ఈబీ అధికారులు ఒక మహిళ వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లపు ఊటను సారా తయారీకి సిద్ధంగా ఉంచగా గుర్తించి ధ్వంసం చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్‌కు డాక్టరేట్



తిరువూరు: స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్‌కు తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ పనితీరు మెరుగుపరచడానికి మెటా హ్యూరిస్టిక్స్ అల్గారిథమ్ అప్లికేషన్ ఉపయోగించే విధానంపై డాక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో రాసిన పరిశోధనా వ్యాసానికి ఆయనకు డాక్టరేట్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. కిరణ్‌కుమార్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది.

20 నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు

మైలవరం: మైలవరంలోని ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయం వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి ఐదు రోజులు జరుగుతాయని ఎన్టీఆర్ జిల్లా ధార్మిక సమితి కో-ఆర్డినేటర్ వి. బాలాజీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న సామూహిత భగవద్గీత పారాయణ, 21న సామూహిక లలిత, విష్ణు సహస్ర పారాయణ, 22న తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఎన్టీఆర్ జిల్లా ధార్మిక సమితి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ భజన బృందాలచే సంప్రదాయ భజన సంకీర్తనలు, అనంతరం స్థానిక దేవాలయ ప్రతినిధులు, వివిధ ధార్మిక సంస్థలు, టీటీడీ వారి ధార్మిక ప్రాజెక్టులు, పారాయణ బృందాలు, భజన బృందాలచే స్వామి వారి ఊరేగింపు, నగర సంకీర్తన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.